# జైలు కథలు

## మూడు కాదు – నాలుగు

సమయం మధ్యాహ్నం రెండుగంటలు కావస్తూంది. బ్లాక్‌లో గాలిరాక వుక్క పోస్తూవుంటే నిద్రపట్టక బైట రాములవారి గుడి ప్రక్కన అరుగుమీద వేపచెట్టు నీడలో కూర్చున్నాను. ఆ సమయంలో సామాన్యంగా అందరూ నిద్రపోతూ వుంటారు. అందువల్ల జైలు ప్రశాంతంగా వుంటుంది. ఉదయం తెరచిన బ్లాక్స్ సాయంకాలంవరకూ మూయరు. అందే బ్లాక్స్ మూసేవరకూ ఖైదీలు యెక్కడైనా తిరగవచ్చు. కాలక్షేపం కొరకు ఆట స్థలం వుంది. రేడియో, పత్రికలు, కేరం బోర్డు, చెస్‌లాటి ఆటవస్తువులు వున్నాయి.

"నమస్తే"

ఆలోచనలనుంచి, బయటపడి ఆగంతకుని చూశాను. చదువు, సంస్కారంవున్న వ్యక్తిలా వున్నాడు.

"నమస్తే, రండి కూర్చోండి." నా ప్రక్కనే దుమ్ముదులిపి కూర్చున్నాడు. పరీక్షగా చూశాను. మంచి రంగు. బలిష్టమైన శరీరం. టెరికాట్ పాంటు, షర్టు ధరించాడు. వాచి. వుంగరాలకు గుత్తుగా ఎడమచేతిపై అరలు. చక్కని వంకీల జుత్తు–చూడగానే కలవారి బిడ్డగా గ్రహించొచ్చు. కాస్త గెడ్డం పెరిగింది. ఈరోజే వచ్చినట్లున్నాడు.

"మీపేరు-" చెప్పాను.

"మీ పేరు." చెప్పాడు. సభ్య సమాజంలో, సభ్యతకోసం అవసరం లేకపోయినా అడగాలి మరి.

"మీరు నా కొక సాయం చేయగలరా?"

"ఏ రూపంగా"

"మా చిన్న తమ్మునికి బెయిల్ త్వరగా కావాలి. వాడి స్టడీస్ దెబ్బతింటాయి. అంచేత వకీలుతో మాట్లాడటానికి అనుమతి కావాలి" తమ్ముని చదువుపై వున్న శ్రద్ధకు సంతోషించాను.

"దఫేదారు వద్ద సంతకం చేసిన తెల్లకాగితం తెచ్చుకోండి. వ్రాసి పెడతాను" ఇక్కడ ప్రతి చిన్న విషయానికీ నా వద్దకు వచ్చి వ్రాయించుకోవటం అందరికీ అలవాటయింది. ఇది నాకు మంచి కాలక్షేపం.

"ఏం చదువుతున్నాడు?"

"టెన్త్‌లో వున్నాడు. వాడుచేసిన ఘనకార్యమే మమ్మల్ని యిక్కడకు రప్పించింది."

"హత్యానేరమా?" అనాలోచిత ప్రశ్న. అవతలివ్యక్తి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయదు కదా!

"అవును వివరంగా చెబుతాను.... వినండి."

.... .... .... ........

కల్వకుర్తి తాలూకాలోని చిన్న గ్రామంలో వర్ధనరెడ్డి పోలీసు పటేల్. తల్లిదండ్రులులేరు, నలుగురన్నదమ్ములు. అందరికంటే చిన్నవాడు కథానాయకుడు రామిరెడ్డి టెన్త్ చదువుతూ వున్నాడు కల్వకుర్తిలో. రెండవవాడు యింటర్. మూడవవానికి చదువు వంటబట్టని కారణంగా వ్యవసాయం చేస్తున్నాడు. కాస్త స్థితికలిగిన కుటుంబమే. పలుకుబడివుంది.

వర్ధనరెడ్డి యిల్లు ఆనుకొని వుంది శంకరరెడ్డి యిల్లు. శంకరరెడ్డికి వర్ధనరెడ్డి తమ్ముడౌతాడు. అంటే! అన్నదమ్ముల పిల్లలు. రెండు యిళ్ళ మధ్య ప్రహరీ వుంది. శంకరరెడ్డికి 8 ఏండ్ల కొడుకు వున్నాడు. శంకరరెడ్డి త్రాగుబోతు. వర్ధనరెడ్డి వాళ్ళపై కక్షతో వాళ్ళను అనేక విధాలుగా బాధిస్తూ వుండేవాడు. ప్రహరీగోడ



పగులగొట్టేవాడు. ద్వారం కమ్ములు పీకేస్తూ వుండేవాడు. బాగా త్రాగి కత్తి తీసుకొని యింటిపైకివెళ్ళి బండబూతులు కూసేవాడు. నిండు పైరుమీదవున్న చేలలో గొడ్లుతోలేవాడు. చేతికివచ్చిన ఫలాన్ని నాశనంచేసేవాడు. వర్ధనరెడ్డి చేలోవున్న చెట్లు కొట్టించి అమ్మేవాడు. కాని సహజంగా శాంత స్వభావంకల్గిన వర్ధనరెడ్డి వాళ్ళు ఏమీ అనేవాళ్ళుకారు. ఇది శంకరరెడ్డికి చాలా అలుసైంది.

అసలింతకూ వారిపై కక్షకు కారణం, మొదట శంకరరెడ్డి ఆ గ్రామ పోలీసు పటేల్. కాని త్రాగుబోతు అయినందువల్లనూ, లెఖ్ఖలు సరిగా చూపించలేకపోవడం వల్లనూ, అతనిని తీసివేసి, అతని స్థానంలో వర్ధనరెడ్డిని నియమించారు. అప్పటి నుంచి అన్ని విధాలా వారిని సాధిస్తూ వస్తున్నాడు.

ఆ రోజు శనివారం. శంకరరెడ్డి ఆగడం శృతిమించిన రోజు. తన చేలో పడిందని వర్ధనరెడ్డి వ్యవసాయ గిత్తను బరిసెతో పొడిచాడు శంకరరెడ్డి. మానవుని పశుత్వానికి అమాయక జీవి బలియైంది. వర్ధనరెడ్డి మనసు వ్యాకులం చెందింది. గిత్తస్థానంలో నన్ను వూహించుకొని చలించిపోయాడు.

శలవులు గడపటానికి అదేరోజు స్వగ్రామం చేరాడు రామిరెడ్డి. తలుపు తీయబోయి ఆగిపోయాడు.

"ఈ రాత్రికి వాడి విషయం తేల్చెయ్యాలి" వర్ధనరెడ్డి కంఠం స్థిరంగా వుంది.

దారిలోవిన్న వార్తనుబట్టి విషయాన్ని గ్రహించాడు రామిరెడ్డి.

అదేరోజు రాత్రి యెవరో తట్టి లేపుతూ వుంటే త్రుళ్ళిపడి లేచాడు వర్ధనరెడ్డి. యెదురుగా తమ్ముడు రామిరెడ్డి. రక్తంతో తడిసిన బట్టలు. చేతిలో రక్త సిక్తమైన గొడ్డలి. చూడటానికి భయంకరంగా వున్నాడు! జరిగినది వూహించుకొనేసరికి వర్ధనరెడ్డి నిలువెల్లా వణికిపోయాడు.

"నేను వచ్చిన వెంటనే విషయాన్ని గ్రహించాను. మీ మాటలు విన్నాను. రాత్రి చాలసేపటివరకూ ఆలోచించాను. ఆలోచనలు ఆగిపోయాయి. ఆవేశం పెల్లుబికింది. గొడ్డలి తీసుకున్నాను. ప్రహరీ దాటాను. డాబా వెనుకభాగంలోని నీటి గొట్టంద్వారా పైకిచేరాను. వేసవికాలం అవటంచేత, భార్య, పిల్లవాడితో కలసి డాబాపై పండుకొన్నాడు. ఆలోచించలేదు. ఒక్కటే వ్రేటుకు తల మొండెంనుంచి వేరైంది. శబ్దంవిని భార్య లేచింది. "అమ్మో!". అంతేసగంకేక గొంతులో వుండగానే గొంతు తెగిపోయింది. ఆ తరువాత పిల్లవాడు"

తమ్ముడు తాపీగా చెబుతూవుంటే, అన్నకు ముచ్చెమటలు పోసినై. మిగిలిన యిద్దరు తమ్ముళ్ళనూ లేపి, అప్పటికప్పుడే ఆ గ్రామం వదిలాడు. కొద్దికాలం తరువాత తమంతట తాముగా కోర్టుకు హాజరయ్యారు.

"అయితే మూడు హత్యలా"

"మూడు కాదు.... నాలుగు పోస్టుమార్టంలో ఆమె గర్భిణీ అని తేలింది".

నా నోరు మూతపడింది! హృదయం ఆగిందేమో తెలియదుమరి. తీర్పు.... ....?

—'ప్రసాద్'